నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

■ ఎస్‌వోటీ, ఆదిబట్ల పోలీసుల మూకుమ్మడి దాడులు ■ ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

ఆదిబట్ల, అక్టోబర్ 5 : ఎస్‌వోటీ, ఆదిబట్ల పోలీసులు కలిసి చేసిన దాడుల్లో 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని మగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాలు.. చత్తీస్‌గడ్ రాష్ట్రం రాయపూర్ జిలా కొలియా గ్రామం బలోడా బజార్‌కు చెందిన వీరేందర్‌కుమార్ వర్మ ఒరిస్సాలోని మల్కన్‌గిరి గ్రామంలో నివాసం ఉంటున్న శ్రీను అనే వ్యక్తి నుంచి 3 కేజీల గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి నేరుగా రైలులో హైదరాబాద్‌కు వచ్చి ఆదిబట్లలో విక్రయించేవాడు. దీంతో సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ పోలీసులు ఆదిబట్ల పోలీసుల సహకారంతో టీసీఎస్ ఎదుట ఉన్న ఓ కాలనీలో శ్రీను గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని నుంచి 3 కేజీల గంజాయి, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆదిబట్లలో మహేశ్వరం జోన్ ఎస్‌వోటీ, ఆదిబట్ల పోలీసులు కలిసి స్వాధీనం చేసుకున్న గంజాయి

ఎల్‌బీనగర్ జోన్ ఎస్‌వోటీ, ఆదిబట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మరో ఘటనలో..

మరో ఘటనలో ఎల్‌బీనగర్ జోన్ ఎస్‌వోటీ, ఆదిబట్ల పోలీసులు దాడి చేసి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జార్కండ్ రాష్ట్రం ధానా మీర్జాచౌకీ సాహెబ్‌గంజ్‌కు చెందిన వాతీన్ అహ్మద్, జార్కండ్ రాష్ట్రానికి చెందిన వకీల్ అనే వ్యక్తి నుంచి కిలో గంజాయిని కొనుగోలు చేసాడు. అక్కడి నుంచి నేరుగా ఆదిబట్లకు తీసుకొచ్చి టీసీఎస్ ఎదుట శ్రీధనలక్ష్మి సిమెంట్ ఇటుకల తయారీ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్న జార్కండ్‌కు చెందిన సలాం అన్సారీతో కలిసి విక్రయించేవాడు. పక్కా సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు ఆదిబట్ల పోలీసుల సహకారంతో గురువారం దాడి చేసి కిలో బరువున్న 142 ప్యాకెట్ల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 4 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో మహేశ్వరం ఎస్‌వోటీ, ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ పోలీసులతో పాటు ఆదిబట్ల పోలీసులు ఉన్నారు.

ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 5: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 11వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 18వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 5: అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి పిలుపునిచ్చారు. సమకాలీన అవసరాలకు అనుగుణంగా బోధన, అభ్యాస పద్ధతులను సంస్కరించుకోవడం ద్వారా విద్యారంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కోవచ్చని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఇటీవల ప్రవేశపెట్టిన మూల్యాంకనంలో సంస్కరణలు, నిరంతర మరియు సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) అమలుపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా బోధనలో చాట్ జీపీటీ వంటి ఆధునిక అవకాశాలు సవాళ్లుగా మారాయని చెప్పారు. ఆధునికత, సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా అధ్యాపకులు నిరంతరం తమను తాము సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఉన్నత విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. బాలికల విద్య సహా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌లోనూ దేశ సగటును దాటి గణాంకాలు నమోదైందని వివరించారు. ఏ రంగంలోనైనా ఎప్పటికప్పుడు మార్పులు అనివార్యమని, నేటి అవసరాలకు అనుగుణంగా బోధన, అభ్యాసన పద్ధతులు మారాల్సిన అవసరాన్ని ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ వివరించారు. హంటర్ కమిషన్ నుంచి కొఠారి కమిషన్ వరకు విద్యా వ్యవస్థలో వచ్చిన సంస్కరణలను ప్రస్తావిస్తూనే సంస్కరణలు అనివార్యమని స్పష్టం చేశారు. ఉన్నత విద్యారంగంలో తీసుకురావాల్సిన మూల్యాంకన సంస్కరణలపై ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ ఎస్.చంద్రశేఖర్ తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవంబర్ 19న గ్రాన్యూల్స్ గ్రీన్ కన్హారన్

కొండాపూర్, అక్టోబర్ 5: ఫిజికల్ ఫిట్‌నెస్, పర్యావరణ పరిరక్షణ బాధ్యతలను మిళితం చేసేలా గ్రాన్యూల్స్ కన్హారన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని జీహెచ్ ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అన్నారు. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్, గ్రాన్యూల్స్ ఇండియాలు నవంబర్ 19న నిర్వహిస్తున్న గ్రీన్ కన్హారన్ రెండో ఎడిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు పర్యావరణ బాధ్యతలపై అవగాహన కల్పించేలా రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యం, ఐక్యత, పర్యావరణ పరిరక్షణ సంస్కృతిని పెంపొందించడం ద్వారా గణనీయమైన మార్పు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. గ్రీన్ కన్హారన్ రెండో ఎడిషన్‌లో నగర పరిధిలోని శాంతివనంలో ఆరు వేల మంది రన్నర్లు పాల్గొననున్నారు. ప్రపంచ వ్యాప్తంగా నాలుగు వేల మంది రన్నర్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రన్‌లో 2 కిలోమీటర్ల ఫ్యామిలీ రన్, 5 కిలో మీటర్ల టైమ్డ్ ఫారెస్ట్ రన్, 10 కిలో మీటర్ల టైమ్డ్ యాత్ర గార్డెన్ రన్, 21కిలో మీటర్ల టైమ్డ్ సాయిరెడ్డి లేక్ రన్, గ్లోబల్ రన్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఈడీ ఉమా చిగురుపాటి, గైడ్ ఆఫ్ హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామ్ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ రెవ.దాజీ తదితరులు పాల్గొన్నారు.

అలరి

ALLARI

తెలుసుకుందాం

1. ఆరావళి పర్వతాల్లో ఎత్తయిన శిఖరం ఏది? ● గురు శిఖర్
2. జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మొదటి భారతీయుడు? ● జి. శంకర్ కురుప్
3. ప్రస్తుతం కనుగొన్న మూలకాల సంఖ్య ఎంత? ● 118

పదప్రస్థ

కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Apple

Ex : Ape

పెద్దల మాట

నేటి నేర ప్రపంచానికి కారణం.. దుర్గుణం, ఆకలి మాత్రమే!

● ఆస్కార్ వైల్డ్

కథ

దురాశ

రంగాపురం గ్రామంలో కొందరు దాతలు.. పేదలకు ఆర్థిక సాయం చేయాలని అనుకున్నారు. సాయం పొందాలనుకునేవారిని రచ్చబండ దగ్గరికి రమ్మని చాటింపు వేయించారు. వారు వరుస క్రమంలో వస్తుంటే.. ఒక్కొక్కరికి రూ. 500 నోటు చొప్పున ఇవ్వసాగారు దాతలు. అయితే, అదే గ్రామానికి చెందిన శరభయ్య దురాశపరుడు. వరుసలో నిలబడి డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత తన ముఖం కనిపించకుండా, గాయపడినట్లు కట్టు కట్టుకొని రూ.500 నోటు ఇంకోటి తీసుకున్నాడు. ఆ తర్వాత మళ్లీ ముఖానికి రంగు పూసుకుని వచ్చి.. మళ్లీ ఒక రూ. 500 నోటు తీసుకున్నాడు. ఇలా తనకు లభించిన మూడు నోట్లనూ తీసుకొని, తన మిత్రుడైన కనకయ్యను కలిశాడు. కనకయ్య కూడా రూ. 500 సాయం పొందాడు. అప్పుడు శరభయ్య.. ''మిత్రమా! నేను మూడుసార్లు వెళ్లి మూడు 500 నోట్లు సంపాదించాను. నీకు ఒక్క నోటే వచ్చింది'' అన్నాడు. అప్పుడు కనకయ్య.. ''అలా మోసం చేసి దక్కించుకున్న సొమ్ము నిలవదు! వెళ్లి, వాళ్ల డబ్బు వాళ్లకు ఇచ్చేసి రా!'' అని సలహా ఇచ్చాడు. కానీ శరభయ్య వినలేదు. వచ్చిన డబ్బును చొక్కా జేబులో పెట్టుకొని చెరువు గట్టుకు వెళ్లాడు. చొక్కాను గట్టు మీదే ఉంచి, స్నానం చేసేందుకు చెరువులో దిగాడు. ఇంతలో ఒక కోతి వచ్చి, అతని చొక్కాను పట్టుకొని పరిగెత్తింది. ఇది శరభయ్య గమనించలేదు. ఆ కోతి అతని చొక్కాలో ఉన్న మూడు 500 నోట్లను తీసుకొని, చొక్కాను దూరంగా పడవేసి.. ఊరి రచ్చబండ దగ్గరికి చేరింది. అక్కడే ఉన్న దాతలు.. డబ్బులు పూర్తిగా పంచేసి, ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. అప్పుడే ఆలస్యంగా ముగ్గురు పేదవాళ్లు అక్కడికి వచ్చారు. దాతలు వారిని చూసి.. ''అయ్యో! డబ్బులు అయిపోయిన తర్వాత వచ్చారే! ముందు వస్తే బాగుండేది!'' అన్నారు. ఇంతలో డబ్బులతో వచ్చిన కోతి.. అక్కడ ఉన్న అరటి పండ్లను తీసుకొని, నోట్లను అక్కడే పడేసి వెళ్లిపోయింది. ఆ డబ్బులను చూసిన దాతలు సంతోషించి.. తాము గమనించనప్పుడు ఆ కోతి తమ డబ్బు తీసుకొని పోయిందని భావించారు. వాటిని ఆ ముగ్గురు పేదవాళ్లకూ పంచారు. అక్కడ చెరువులోంచి బైటికి వచ్చిన శరభయ్య.. తన చొక్కా కోసం వెతికాడు. దూరంగా చొక్కా కనిపించినా.. అందులో డబ్బులు లేవు. విషయం తెలిసిన మిత్రుడు కనకయ్య.. ''నేను చెప్పలేదా! దురాశ పనికి రాదంటే నువ్వు వినలేదు. ఆ డబ్బు ఎక్కడికి చేరాలో అక్కడికే చేరి ఉంటుంది'' అన్నాడు.

నీతి : దురాశ పనికి రాదు.

● సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

పిక్ క్వాండ్స్

ఎం. హారిక, రాయిగిరి.

ఫన్ ఆన్ సర్కిల్



_oy



_ird

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com

తెక్కుతో ప్రయాణం

ఇచ్చిన ఆధారాలను బట్టి, కూడికలు-తీసివేతలు చేస్తూ.. ఎలుక తన ఆహారాన్ని చేరే దారి చూపండి.



జవాబులు : Boy, Bird